క్లుప్తంగా

మహానందీశ్వరుడి సన్నిధిలో..



వేదపండితుల ఆశీస్సులు అందుకుంటున్న ఎస్‌ఈ కృష్ణ కుమార్ దంపతులు

మహానంది: మహానందీశ్వర స్వామి సన్నిధిలో ఏపీ ట్రాన్స్ కో ఎస్‌ఈ డీవీ కృష్ణకుమార్ శనివారం పూజలు నిర్వహించారు. సతీసమేతంగా వచ్చిన వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి స్వామి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆయన వెంట మండల అసిస్టెంట్ ఇంజినీర్ ప్రభాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం



హరిప్రసాద్ మున్సిపల్ కమిషనర్

ఆత్మకూరు : ఆత్మకూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని నూతన మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని మంచినీటి సమస్య తలెత్తకుండా సత్వర చర్యలు తీసుకుంటానన్నారు. రహదారులు , వీధి దీపా లు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం 21వ వార్డు కౌన్సిలర్ బోయలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బోయరాముడు, మున్సిపల్ సిబ్బంది కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

జాగ్రత్తలతో క్షయవ్యాధి నివారణ



అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ రవికుమార్

నందికొట్కూరు: క్షయ వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టీబీ సూపర్‌వైజరు రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని దివ్యాంగుల హక్కుల పోరాట సంఘం కార్యాలయంలో వికలాంగులకు క్షయవ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 15 రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. గుట్కా, ఖైనీ, ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లు ఉన్న వారికి రోగనిరోధక శక్తి తగ్గి క్షయవ్యాధి వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు.

క్రికెట్ విజేత మార్కెట్ రాకెట్స్



ట్రోఫీతో విజేత మార్కెట్ రాకెట్స్ టీం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలో జరిగిన టీ–10 క్రికెట్ టోర్నీలో మార్కెట్ రాకెట్స్ టీం విజేతగా నిలిచింది. కొద్దిరోజులుగా జరుగుతున్న లీగ్ పోటీల్లో మొత్తం 32 జట్లు పాల్గొన్నాయి. మొదటి స్థానం సాధించిన మార్కెట్ టీంకు నిర్వాహకులు శనివారం రూ.20,000 నగదు బహుమతితో పాటు ట్రోఫీ, రెండవ స్థానం సాధించిన ఫ్రెండ్స్ టీంకు రు.10,000 నగదు బహుమతిని అందజేశారు.

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం



రక్తదానం చేసిన సిబ్బందికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఆర్‌ఎం రజియా సుల్తానా

నంద్యాల టౌన్: సమష్టి కృషితో రోడ్డు ప్రమాదాలను నివారిద్దామని జిల్లా ప్రజా రవాణాధికారి రజియా సుల్తానా సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను సామాజిక బాధ్యతగా చూడాలన్నారు.అనంతరం 27 మంది ఆర్టీసి సిబ్బంది రక్తదానం చేయగా వారిని అభినందించారు. డిపో మేనేజర్ గంగాధర రావు, అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆదివారం వైఎస్సార్ ఆసరా మెగా చెక్ పంపిణీ కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్ క్రాంతి పథం మండల అదనపు ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, స్వయం సహాయక పొదుపు మహిళలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నట్టేట ముంచిన నకిలీ విత్తనాలు

- పంట పచ్చగా మారి పూత, పిందెకు నోచుకోని మినుము పైరు
- లబోదిబోమంటున్న రైతులు
- పట్టించుకోని విత్తనాల దుకాణం యజమాని



పచ్చగా మారిన రైతులు సాగుచేసిన మినుము పంట



పూత, పిందె రాకుండా గిడసబారిన మినుము మొక్కలు

జూపాడుబంగ్లా: ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంట చేతికందే సమయానికి పంట పసుపచ్చగా మారి పూత, పిందె లేకపోవటంతో రైతులు పంటనష్టం వాటిల్లిందని జూపాడుబంగ్లా, తంగడంచ గ్రామాల రైతులు లబోదిబోమంటున్నారు. విషయాన్ని రైతులు విత్తన డీలర్ దృష్టికి తీసుకెళ్లగా అమకేం సంబంధం లేదని, కంపెనీ అధికారులకు ఫోన్ చేయండని చేతులు దులుపుకున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్యాకెట్ రూ.700 చొప్పున కొనుగోలు

మండలంలోని జూపాడుబంగ్లా, తంగడంచ గ్రామాల గతేడాది డిసెంబర్ మాసంలో నందికొట్కూరు పట్టణంలోని పల్లవి సీడ్స్ దుకాణంలో నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ సీడ్స్ సంబంధించిన లాట్‌నెంబర్: 02275 టీ9, లాట్ నెంబర్: 02273 టీఏఏ-1 రకం మినుము విత్తనాలను 5కిలోల ప్యాకెట్ రూ.700ల చొప్పున కొనుగోలు చేశారు. ఆయా గ్రామాల పరిధిలో 25మంది రైతులు డిసెంబర్ మాసంలో 50 ఎకరాల్లో పంటను సాగుచేశారు. రెండు మాసాలు గడిచినా ఇప్పటిదాకా పూత, పిందె రాకపోవటంతో పాటు సాగుచేసిన పంట పచ్చగా మారుతుండటంతో నకిలీవిత్తనాలతో నష్టపోయినట్లు గ్రహించి కలవరపాటుకు గురయ్యారు. విషయాన్ని విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం యజమాని నాగేశ్వరరెడ్డి దృష్టికితీసుకెళ్లగా.. తనకేం సంబంధం లేదని, విత్తనాలు నేషనల్ సీడ్స్ కార్పొరేషన్‌కు సంబంధించినవి కనుక వారికి ఫోన్‌చేసుకోవాలని నేషనల్‌సీడ్స్ అధికారుల ఫోన్‌నెంబర్ రైతులకు ఇచ్చి చేతులు దులుపుకున్నాడు.

ఎకరాకు రూ.40వేల దాకా పెట్టుబడి

ఇప్పటికే ఎకరాకు తాము రూ.40వేల దాకా పెట్టుబడి పెట్టామని, మినుము క్వింటా ధర రూ.10,500ల గిట్టుబాటు ధర ఉన్నందున తాము ఎకరాకు రూ.లక్ష మేర పంట నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

శాస్త్రవేత్తలతో పరిశీలన చేయిస్తాం

ఈ విషయంపై నేషనల్ సీడ్స్‌కార్పొరేషన్ ఆర్‌ఎం కేశవమూర్తికి ఫోన్‌చేసి వివరణ కోరగా తెలంగాణ, ఏపీలో ఈరకం విత్తనాలు సాగుచేసిన పంటలో సమస్య నెలకొందని చెప్పారు. తాను సెలవులో ఉన్నానని, శాస్త్రవేత్తలతో రైతులు సాగుచేసిన పంటను పరిశీలన చేయిస్తామని తెలిపారు.

నష్టపరిహారం చెల్లించాలి



నకిలీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోయాం. మాకు నకిలీ విత్తనాలు అంటగట్టిన విత్తనాల దుకాణం యజమానిపై చర్యలు తీసుకొని నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ సంస్థ నుంచి మాకు పంటనష్టపరిహారం మంజూరు చేయించాలి.

– మధు, రైతు, జూపాడుబంగ్లా

పూత, పిందె రాలేదు



మా పొలంలో సాగుచేసిన మినుము పంట పచ్చగా మారి పూత, పిందెరాలేదు. మా చుట్టుపక్కల రైతుల సాగుచేసిన మినుము పంటలు బాగున్నాయి. మా పంటనే సక్రమంగా లేదు. దీన్ని బట్టిచూస్తే మమ్మల్ని నకిలీ విత్తనాలతో నష్టపరిచారని తెలుస్తోంది. మాకు నష్టపరిహారంచెల్లించాలి లేకపోతే అప్పులపాలవుతాం.

– సుభాన్, రైతు

వెంకటాపురంలో అన్నదాన కార్యక్రమం

ఆత్మకూరు : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కాలినడకన వెళ్లే శివస్వాములకు, భక్తులకు వెంకటాపురం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానం కమిటీ నిర్వాహకులు శనివారం తెలిపారు. మార్చి 1 నుంచి 7వ తేదీ వరకు ప్రతిరోజు భిక్ష, అల్పాహారాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి భక్తుడికి ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతరం అన్నదానం కొనసాగిస్తామని చెప్పారు. దేవస్థానం పరిధిలో 26సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా చర్చి ప్రతిష్ఠ వేడుకలు

మిడుతూరు: మండల కేంద్రంలో శనివారం సీఎస్ఐ నూతన చర్చి ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీఎస్ఐ నంద్యాల అధ్యక్ష ఖండము, నందికొట్కూరు డీనరి మిడుతూరు పాస్ట్రేట్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డాక్టర్ ఐజక్ వరప్రసాదు మోడరేటరి కమిషనరి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. నందికొట్కూరు శాసనసభ్యులు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, ప్రాస్టేట్ చైర్మన్ గడ్డం యోహాన్ బాబు ఆధ్వర్యంలో సంఘం పెద్దలు స్వాగతం పలికారు. గౌరవ అతిథులుగా బిషప్ ఎమిరిటస్, రాయలసీమ డయాసిస్ బి.డి. ప్రసాదు, డీనరి చైర్మన్ మైకెల్ శ్యామ్ సుందర్, సంఘస్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరి



పాత ముచ్చుమర్రి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెక్టార్ అధికారి సంజన్న, ఎస్ఐ జయశేఖర్

పగిడ్యాల: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరి ఉండాలని సెక్టార్ ఆఫీసర్ నందికొట్కూరు ఈఓఆర్డీ సంజన్న బూత్‌స్థాయి అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లోని 89, 90, 91, 92, 93 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్‌లు, గాలి, వెలుతురు వచ్చేలా కిటికీలు, విభిన్న ప్రతిభావంతులకు ర్యాంప్ సదుపాయం, నీటి వసతి తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. బూత్‌స్థాయి అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్, వీఆర్వోలు నరసింహా, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

14న కొలనుభారతిలో వసంత పంచమి వేడుకలు

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామ సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలను భారతీదేవి ఆలయంలో స్వస్తిశ్రీ శోభక్రుత్ నామ సంవత్సర మాగ శుద్ధ పంచమి 14వ తేదీ బుధవారం రోజున వసంత పంచమి వేడుకలను జరుపుతున్నట్లు ఈవో మోహన్ శనివారం తెలిపారు. వేడుకలను భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారి పుట్టిన పండుగ, బుధవారం ఉదయం ఐదు గంటల 30 నిమిషాలకు శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి దేవస్థానం శ్రీశైలం వారి అందించే పట్టు వస్త్రములతో అమ్మవారికి మహాన్యాస పూర్వక ఏక వార రుద్రాభిషేకం, సహస్ర నామ కుంకుమార్చన, పుష్పార్చన, మహా మంగళ హారతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు, బీజాక్షరములు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వసంత పంచమి వేడుకలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే నియోజకవర్గ అభివృద్ధి



రేగడగూడురు -పెసరవాయి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం

వెలుగోడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమైందని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శనివారం మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బోయరేవుల గ్రామంలో రూ.23.90 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే, రూ.10 లక్షలతో నిర్మించిన సచివాలయం వద్ద సీసీ రోడ్డును ప్రారంభించారు. గ్రామ నాయకులు ముంతల విజయభాస్కర్‌రెడ్డి, రమణ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.

రూ.2.86 కోట్లతో బీటీ రోడ్డు

రేగడగూడురు గ్రామంలో రూ.25.50 లక్షలతో నూతన సచివాలయ, ఆర్‌బీకే భవనం, రూ.2.86 కోట్ల నిధులతో నిర్మించనున్న రేగడగూడురు–పెసరవాయి బీటీ రోడ్డుకు భూమిపూజ చేశారు. రూ.20.0 లక్షలతో ప్రైమరీ హెల్త్ సెంటర్, గుంతకందాలలో రూ.20.80 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..నియోజకవర్గంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి జరిగిందని చెప్పారు. పార్టీలకు, కులాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. ప్రజలు మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్‌లు వేల్పుల జయపాల్, రజియాబీ, అచ్చెమ్మ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, నందిరెడ్డిగారి రామిరెడ్డి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ వెంకటేశ్వరమ్మ, కుశాయి సామిరెడ్డి, ఎంపీటీసీలు అంబాల సుభద్రమ్మ, దుబ్బ అంకమ్మ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఓ వరమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మండల పరిధిలోని 10 బొల్లవరం గ్రామానికి చెందిన గొల్ల సత్యనారాయణ వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.65 వేలు మంజూరయ్యాయి. శనివారం పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారుడికి ఎమ్మెల్యే చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగనన్న పెద్ద పీట వేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ పథకం కింద మూడు వేలకు పైగా రోగాలకు ఉచిత వైద్యం అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగనేనన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టరు రమాదేవి, కౌన్సిలర్లు ధర్మారెడ్డి, జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కైపా కుటుంబానికి పరామర్శ

మిడుతూరు: మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, పీరుసాహెబ్ పేట గ్రామానికి చెందిన కైపా శ్రీధర్‌రెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ శనివారం గ్రామానికి చేరుకొని ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. శ్రీధర్ రెడ్డి లేని లోటు తీర్చలేనిదని, మృతి చెందడం బాధాకరమన్నారు.

హరితవనం నిర్మాణానికి భూమి పూజ

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని పీవీ నగర్ వద్దనున్న మున్సిపాలిటీ హిందూ శ్మశాన వాటిక స్వర్గధామంలో బృందాన హరితవన నిర్మాణానికి నవ నిర్మాణ సమితి సభ్యులు శనివారం భూమి పూజ చేశారు. డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ నిధులు రూ.10లక్షలతో హరిత వనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇందులో 27నక్షత్రాలతో పాటు 27 మొక్కలను, 12 రాశులకు గాను వాటికి సంబంధించిన మొక్కలతో పాటు వివిధ రకాల మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు. మైహోమ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో రెండు నెలల్లో నిర్మాణం పూర్తిచేస్తామన్నారు.

పైపులైన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు: పట్టణంలోని 27వ వార్డులో నూతనంగా పైపులైన్ నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని కౌన్సిలరు సమీరాబాను, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఉస్మాన్‌బేగ్ అన్నారు. శనివారం పట్టణంలోని 27వ వార్డులో నూతన పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్న సాయంతో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చొరవతో వార్డుకు రూ.1.12 కోట్ల నిధులను మంజూరు చేయించి సీసీ రోడ్లు, డ్రైనేజీ, నూతన పైపులైన్ నిర్మాణాలను పూర్తి చేస్తునట్లు స్పష్టం చేశారు. సీఎం జగనన్న పాలనలో స్పెషల్ ప్యాకేజి కింద రూ. 50 లక్షలు, 15వ ఆర్థిక నిధులు రూ. 25 లక్షలు, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ. 25 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిధులు రూ.12 లక్షలతో వార్డు రూపురేఖలు మారినట్లు చెప్పారు. వార్డులోని సమస్యలను 90 శాతం పరిష్కరించడం జరిగిందని చెప్పారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



నవధాన్యాలతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆత్మార్పణ మహోత్సవాన్ని పురస్కరించుకొని రెండవ రోజు వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టి నవధాన్యాలతో అలంకరించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి వాసు, మహిళా మండలి అధ్యక్షురాలు ఇందుమతి మాట్లాడుతూ ఆదివారం అమ్మవారికి వజ్రకిరీట ధారణ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

పీవీకి భారతరత్నపై హర్షం



మాట్లాడుతున్న బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డును ప్రకటించడం హర్షించదగ్గ విషయమని బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోన సుధీర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నంద్యాల నుంచి రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా గెలిచి దేశ ప్రధానిగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన మహనీయుడని కొనియాడారు. ఆయన హయాంలో పట్టణంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని, స్మృతిగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సభ్యులు బాలమురళీకృష్ణ, రాజశేఖర్, చంద్రశేఖర్, భరద్వాజ పాల్గొన్నారు.

పశుబీమా పాడిరైతులకు వరం

దొర్నిపాడు: పశుబీమా పథకం రైతులకు వరంలాంటిదని పశువైద్యాధికారి పుల్లయ్య తెలిపారు. శనివారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామ పశువైద్యశాలలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీపీఎల్, ఎస్సీ, ఎస్టీ పాడి రైతులు మూడేళ్లకు రూ.384 చెల్లిస్తే పాడిగేదె, ఆవులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.30వేలు, ఏపీఎల్(దారిద్య్ర రేఖకు ఎగువ ఉన్న రైతులు రూ.960 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే గొర్రెలు, మేకలకు సంవత్సరం కాలానికి రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్లకు రూ.75, ఇతరులు రూ.90, రూ.135, రూ.187.5 చెల్లిస్తే ఒక్కో గొర్రెకు రూ.6వేలు ఇస్తుందన్నారు. అలాగే పశువులకు వాటి సంఖ్యను బట్టి రూ.3లక్షల వరకు బ్యాంకుల్లో రుణాలకు కూడా ఇస్తారని వివరించారు. అనంతరం పాడి రైతులకు పశు ఆరోగ్య సంరక్ష కార్డులను అందజేశారు. జేవీఓ రమణయ్య, ఉప సర్పంచ్ మహేష్, మాజీ సర్పంచ్ ఉశేనయ్య పాల్గొన్నారు.

బీజేపీ పాలనపై ఉద్యమించాలి

నంద్యాల(న్యూటౌన్): కేంద్రంలోని బీజేపీ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని వారి పాలనను వ్యతిరేకిస్తూ కార్మికులు, ఉద్యోగులు ఉద్యమించాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా కార్యదర్శి సుంకన్న తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మెకు సిద్ధం కావాలని కోరారు. అన్ని పారిశ్రామిక కేంద్రాల్లో విధులు బహిష్కరించి కార్మికులు, ఉద్యోగులు సమ్మె చేయాలని చెప్పారు. కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు బంద్‌కు సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రఘురామ్మూర్తి, రమేష్, బాలకృష్ణ, అబ్బాస్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు



13వ వార్డులో ప్రజల దాహార్తి తీర్చేందుకు బోరు వేయిస్తున్న కౌన్సిలరు, అధికారులు

నందికొట్కూరు: వేసవి కాలంలో దాహం తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో బోరు వేస్తునట్లు 13వ వార్డు కౌన్సిలరు శాంతకుమారి తెలిపారు. శనివారం పట్టణంలోని 13వ వార్డులో నూతన బోరు తవ్వకాన్ని పూజ చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వార్డులో స్పెషల్ ప్యాకేజీ కింద రూ. 60 లక్షలు, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ. 24 లక్షలు నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. జనవరి చివరి వారంలో జరిగిన సాధారణ సమావేశంలో పీ.రాజశేఖర్ ఇంటి నుంచి రాజన్న ఇంటి వరకు 220 మీటర్ల పొడవున డ్రైనేజీ నిర్మాణానికి రూ.10 లక్షలు, బంగారు షాపు నారాయణగౌడు ఇంటి నుంచి 200 మీటర్ల పొడవు డ్రైనేజి నిర్మాణానికి రూ.10 లక్షలు, పొరుమంచాల బాబు ఇంటి నుంచి బషీర్ అహమ్మద్ ఇంటి వరకు సీసీ రోడ్డు రూ. 4 లక్షలతో 70 మీటర్ల పొడవునా నిర్మామం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు విజ్జి, రమేష్, ముర్తుజావలి, శ్రీను, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ఎక్కిస్తే చర్యలు



ఆటోడ్రైవర్లకు సూచనలు ఇస్తున్న సీఐ నాగభూషణ్

వెలుగోడు: ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ నాగభూషణ్ హెచ్చరించారు. శనివారం రాత్రి స్థానిక పోలీసుస్టేషన్ ప్రాంగణంలో ఎస్ఐ భూపాలుడుతో కలిసి ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలని, యూనిఫాం ధరించాలన్నారు. ఇన్సురెన్స్ గడువులోగా చెల్లించి వాహనాలు నడుపుకోవాలని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదు. మద్యం సేవించి వాహనం నడిపితే డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ఆదోనిరూరల్: మండలంలోని దిబ్బనకల్ గ్రామకొండల్లో శనివారం తాలూకా పోలీసులు నాటుసారా స్థావరాలపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో 200 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి, నిర్వాహకుడు వెంకటేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు. అలాగే పత్తికొండ మండలం జేఎంపీ తండాకు చెందిన రవీంద్రనాయక్ అనే వ్యక్తి 50 లీటర్ల నాటుసారాను ఆదోనికి తరలిస్తుండగా విరుపాపురం వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

రవాణా రంగాన్ని కాపాడుకుందాం

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టాలు రవాణా రంగ కార్మికుల పాలిట శాపంగా మారాయని, వాటిని ఉపసంహరించుకునేంత వరకు ఐక్యంగా పోరాడుదామని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆటో, లారీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ చర్యలతో ఈ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు లేక నిరుద్యోగులైన అనేక మంది ఆటో, లారీ, బస్సు, కారు, జీపు తదితర వాహనాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రమేష్‌బాబు, కరీముల్లా పాల్గొన్నారు.